క్లుప్తంగా

ఎస్పీ శ్రీధర్‌కు శుభాకాంక్షలు



ఎస్పీ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీధర్‌ను ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధుల బృందం గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో చాంబర్ ప్రతినిధులు అనిల్ కుమార్ జైన్, యెండూరి నాగేశ్వరరావు, కర్రెళ్ల రమేష్‌బాబు, కుప్పాల రామకృష్ణ, కట్టోజు సన్నయ్యదాసు, అరల్లపల్లి ముత్యం, రాంబాబు, సింగినీడి బాబు తదితరులు ఎస్పీ శ్రీధర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరి



సమావేశంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో గౌరీకుమారి

ఉప్పలగుప్తం: ఐదేళ్ల లోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని తప్పనిసరిగా ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీసులకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది మమేకమై వలంటీర్‌ల సహాయంతో 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్‌కార్డును నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవి జాగ్రత్తలపై చర్చిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

అమలాపురం టౌన్: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా షాపుల్లో పనిచేసే కార్మికులకు వడదెబ్బ తగలకుండా యజమానులు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ సూచించారు. జిల్లాలో వేడి గాలుల పరిస్థితులు, ఉపశమన చర్యలపై కార్మిక శాఖ సూచనల మేరకు స్థానిక కల్వకొలను వీధిలో చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగబాబు, చాంబర్ కోశాధికారి కర్రెళ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



విద్యార్థులకు మజ్జిగను అందిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి, సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో దాతలు ముందుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ముత్యాల రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు లంచ్ బాక్స్‌ల పంపిణీ

ముమ్మిడివరం: మండలంలోని మర్లపాలెంకు చెందిన పీఎస్ వర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ పి.ఉదయ భాస్కరవర్మ చేతుల మీదుగా గురువారం మర్లపాలెం గ్రామానికి చెందిన 50 మంది పేదలకు స్టీల్ లంచ్ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం/అమలాపురం రూరల్: చల్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ తీగలను ఆనుకొని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి, వాసాలతిప్ప, నక్కారామేశ్వరం, గోపవరం, సరిపల్లి, సవరప్పాలెం, వన్నె చింతలపూడి, చింతాడ గరువు, సమనస, రంగాపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వస్తే వరుస... లేకుంటే ఆలస్యం

- మారని ఆర్టీసీ బస్సుల తీరు
- ప్రయాణికులు, విద్యార్థుల అగచాట్లు



తాళ్లరేవులో ఒకేసారి వరుసగా రైలుపెట్టెలు మాదిరిగా వెళుతున్న మూడు ఆర్టీసీ బస్సులు

తాళ్లరేవు: ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ–అమలాపురం రహదారిలో 15 నిమిషాలకు ఒకసారి రావాల్సిన బస్సులు ఒకేసారి క్యూ కట్టినట్టు రావడం, లేకుంటే తీవ్ర ఆలస్యం కావడంతో స్థానికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పలు సంస్కరణలు తీసుకొచ్చినా కొందరు సిబ్బంది వైఖరిలో మార్పు రాకపోవడంపై తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం

కాకినాడ నుంచి యానాం మీదుగా అమలాపురం రోజూ 22 ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి. కాకినాడ, అమలాపురం డిపోలకు చెందిన ఒక్కో బస్సు మూడు ట్రిప్పులు వేస్తున్నాయి. అయితే ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి రాకపోవడంతో దూర ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నిత్యం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. తాళ్లరేవు, కోరంగి, పటవల, మట్లపాలెం, చొల్లంగి, సుంకరపాలెం, ఇంజరం గ్రామాల నుంచి విద్యార్థులు అమలాపురం, ద్రాక్షారామ, కాకినాడలోని పలు పాఠశాలలు, కళాశాలలకు నిత్యం వెళుతుంటారు. వీరిలో అత్యధిక శాతం మంది సీజనల్ పాస్‌లపైనే ప్రయాణాలు సాగిస్తుంటారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో కళాశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. రాయితీ బస్‌పాస్‌లు తీసుకున్న కారణంగా ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థులు ఎంతసేపైనా ఎదురుచూస్తుంటారు. మరో వైపు ఎక్కువసేపు బస్సులు రాకపోతే ప్రమాదకరంగా ఫుట్‌బోర్డులోనే వేలాడుతూ ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తున్న విద్యార్థులు



సుంకరపాలెం జంక్షన్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

రైలు పెట్టెల్లా ఒకేసారి

ఒక్కోసారి సుదీర్ఘ సమయం బస్సులు రాకపోవడంతో ప్రధాన కూడళ్లలో ప్రయాణికులు ఎదురుచూపులు చూడడం సర్వసాధారణమై పోయింది. ఆర్టీసీ బస్సులు వస్తే రైలు పెట్టెల మాదిరిగా ఒకేసారి రెండు మూడు బస్సులు వస్తున్నాయని, లేకుంటే ఒక్కటీ రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆటో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అయినా ఆర్టీసీ బస్సులు సమయానికి రాక ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదంటున్నారు. ఇకనైనా ఆర్టీసీ బస్సులను సకాలంలో వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, విద్యార్థుల కోసం ప్రత్యేక అదనపు బస్సులు నడపాలని కోరుతున్నారు.

సమయానికి రావడం లేదు



నిర్ణీత సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడం వల్ల రోజూ కళాశాలకు వెళ్లడం, ఇంటికి రావడం ఆలస్యమైపోతున్నాయి. రెండు మూడు బస్సులు ఒకేసారి వచ్చేయడం, లేదంటే తీవ్ర జాప్యంతో రావడం సర్వసాధారణమైపోయింది. బస్సుల ఆలస్యం వల్ల ఎక్కువమంది గుమిగూడి ఫుట్‌బోర్డు ప్రయాణం సైతం తప్పడం లేదు.

– మణికంఠ, విద్యార్థి

సమయపాలన పాటించేలా చర్యలు చేపడతాం



బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు చేపడతాం. కళాశాల సమయాల్లో బస్సులు ఆపేలా ప్రత్యేకంగా దృష్టి పెడతాం. బస్సు ఖాళీగా ఉండి ఆపకుండా వెళ్లిపోతే సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– చల్లా సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్, అమలాపురం

సెంటాక్ కార్యాలయం మార్పు

యానాం: యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్‌లోని నాలుగు రీజియన్‌ల్లో విద్యార్థులకు మెడికల్, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు కౌన్సిలింగ్ నిర్వహించే సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ(సెంటాక్) కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ఇన్ పుదుచ్చేరి నుంచి కామరాజ్ మణి మండపానికి మార్చినట్లు సెంటాక్ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ నిర్వహించిన ప్రదేశం నుంచి కామరాజ్ మణిమండపం క్యాంపస్, కరువాడికుప్పం, పుదుచ్చేరికి మార్చినట్లు చెప్పారు.

చిన్ననాటి మిత్రుడికి సాయం



బండారులంకలో విజయ్‌కృష్ణకు గృహోపకరణాలు అందజేస్తున్న మిత్రులు

అమలాపురం రూరల్: ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బండారులంక పేరివారి కాలనీకి చెందిన చందన విజయ్‌కృష్ణకు తన చిన్ననాటి మిత్రులు సాయం చేశారు. విజయ్‌కృష్ణతో కలిసి 1997–98లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు జాన గణేష్, ఉప్పుగంటి సీతారాం, సరెళ్ళ ఏడుకొండలు, పిచ్చిక సత్యం తదితరులు తమ వంతు సహకారంగా రూ.11 వేలు విలువ చేసే వివిధ గృహోపకరణాలు, రూ.25 వేలు నగదు గురువారం అందజేశారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



నడిపూడి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పినిపే విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- నడిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం నడిపూడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. మంత్రి విశ్వరూప్ మెట్ల సత్యనారాయణరావు కాలనీ, నడిపూడి బొక్కావారి పేట, కుమార్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అర్హత గల లబ్ధిదారులు ఇంకా ఎవరైనా మిగిలి ఉన్నారా అన్న వివరాలను ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి అక్కడికక్కడే అధికారుల్ని ఆదేశించారు. సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ రంకిరెడ్డి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.27 కోట్లతో గ్రామాల్లో పీఆర్ రోడ్లు



రెడ్డిపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురం నియోకవర్గంలో ఏషియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ)నిధులు రూ.27 కోట్లతో పీఆర్ రోడ్లు అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట రవాణ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నడిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మెట్ల రాంజీ కాలనీ వరకూ రూ.84 లక్షలతో రహదారి నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. రాంజీ కాలనీలో రూ.5 లక్షల సచివాలయ నిధులుతో నిర్మించిన సీసీ రోడ్డు, రెడ్డిపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లతో కలిసి మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరి రామ్‌గోపాల్, సర్పంచ్ ప్రసన్న ప్రవీణ్, కార్యదర్శి కట్టా సత్తిబాబు, ఎంపీడీవో కాశీ విజయ ప్రసాద్, బొంతు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళాధికారి మురళీ కొండబాబు



ముమ్మిడివరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్థానిక నల్ల వంతెన సమీపంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అగ్నిమాపక యంత్రాలు, పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేసి అవి ఎలా పనిచేస్తాయో ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులు అగ్ని ప్రమాదాలకు సంబంధించిన తమకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ముమ్మిడివరం: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్.గంగన్న దొర ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రవీంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. స్కూలు యాజమాన్యం, ఉపాధ్యయులు, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మూసివేతపై యువకుల నిరసన



మూసివేసిన రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు, పట్టణ సీఐ దుర్గా శేఖర్‌రెడ్డి

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరు సమీపంలో ముస్లిం వీధికి వెళ్లే అడ్డతోవను ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా పట్టణ పోలీసులు ఇటీవల ఇనుప పైపులతో మూసివేశారు. ప్రజలకు ఎంతో వెసులుబాటుగా ఉంటున్న రోడ్డును మూసేయడం తగదని అభ్యంతరం చెబుతూ స్థానిక యువకులు గురువారం అక్కడ కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పట్టణ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి మూసివేసిన రోడ్డు ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. కనీసం మోటారు సైకిల్ వెళ్లేటట్టు అవకాశం ఇవ్వాలని యువకులు కోరారు. దీనిపై పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ నాయుడు తెలిపారు.

23న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు

ముమ్మిడివరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట వ్యాప్తంగా ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌ల్లో ప్రవేశానికి గాను ఈ పరీక్షలు జరుగుతాయి. ఐదవ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగా ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ డౌన్ లోడు చేసుకుని పరీక్షా కేంద్రానికి రావాలని సూచించారు.

ఆలోచింపజేసిన అంబేడ్కర్ నాటకం



అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం రాత్రి ప్రదర్శించిన అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటకం, నృత్య రూపకం ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకం అంబేడ్కర్ జననం నుంచి అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఆయన పడ్డ తపన, రాజ్యాంగ రచన వరకూ సాగింది. నాటకాన్ని అంబేడ్కర్ అభిమానులు జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, బూల విజయ బాబు, గోసంగి సత్యనారాయణ, దాసరి సత్తిబాబు పర్యవేక్షించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ నాటకాన్ని ఇప్పటి వరకూ 524 పర్యాయాలు ప్రదర్శించామని అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు.

నకిలీ వైద్యుల వ్యవహారంపై కేసు

మండపేట: ద్వారపూడిలో నకిలీ వైద్యుల వైద్య శిబిరం నిర్వహణపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ప్రైవేట్ ఏజెన్సీ పేరిట ముగ్గురు వ్యక్తులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందుల పేరిట రోగుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. పంచాయతీ సిబ్బందికి అనుమానం వచ్చి మండల వైద్యాధికారి ఎస్.సూర్యనారాయణరెడ్డికి సమాచారం అందించగా ఆయన విచారణ చేసి వారు క్వాలిఫైడ్ వైద్యులు కారని గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ శివకృష్ణ విచారణ చేసి గురువారం ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివలు స్వయం ఉపాధికి సారథులు

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: డ్వాక్రా సంఘాలకు బ్యాంక్‌ల ద్వారా ఇస్తున్న రుణాలతో నేడు మహిళలు స్వయం ఉపాధికి సారథులవుతున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభ కార్యక్రమంలో సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మెప్మా మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు ప్రారంభించారు. పట్టణంలోని ఒక్కో వార్డు నుంచి ఒక్కో డ్వాక్రా సంఘం మహిళలు తాము తయారు చేసిన స్వయం ఉపాధికి ఊతమిచ్చే వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఏర్పాట్లు చేశారు. ఒక రోజు నిర్వహించిన ఈ మెప్మా మార్కెట్‌తో ఉదయం నుంచి సాయంత్రం వరకూ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. మహిళలు తయారు చేసిన తిను బండారాలు, అల్లిక వస్తువులు, చేనేత వస్త్రాలు, పచ్చళ్లు తదితర వస్తువుల విక్రయంతో కూడిన ప్రదర్శనలు ప్రజాప్రతినిధులు ఆసక్తిగా తిలకించడమే కాకుండా పలు వస్తువులు కొనుగోలు చేసి మహిళల చిరు వ్యాపారాలకు తమ వంతు చేయూతనిచ్చారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహిళల్లో ఆర్థిక సాధికారత తీసుకొచ్చేందుకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మహిళా కౌన్సిలర్లు యండమూరి గంగ, దొంగ నాగ సుధారాణి, మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మంగాదేవి పాల్గొన్నారు.

పట్టణ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రాజా



సయ్యద్ అబ్దుల్ రహమాన్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రహమాన్(రాజా) నియమితులయ్యారు. రాష్ట రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సిఫార్సులతో జిల్లా పార్టీ నుంచి వచ్చిన నియామక ఉత్తర్వులను జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అందించారు. రాజాను మంత్రి విశ్వరూప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ రాష్ట కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మంత్రి తనయుడు డాక్టర్ శ్రీకాంత్ తదితరులు అభినందించారు. అధ్యక్షుడు రాజాతో పాటు పట్టణ పార్టీ మైనార్టీ సెల్‌కు మరో 20 మంది ముస్లిం నాయకులు సభ్యులుగా నియమితులయ్యారు. పట్టణంలో ముస్లిం సంక్షేమానికి అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ విధానాలను పట్టణంలో మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు కృషి చేస్తానని అధ్యక్షుడు రాజా అన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న అక్రమ మద్యం

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను పోలీసులు గురువారం పట్టుకొన్నారు. పాతయింజరం వద్ద ఎస్ఐ సీహెచ్ రాజేష్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తుండగా యానాం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్న ఆటోలో అక్రమ మద్యం గుర్తించారు. ఆటోలో ఉన్న 180 ఎంఎల్ బాటిల్స్ 336, 500 ఎంఎల్ బీర్లు 24, 750 ఎంఎల్ బాటిల్స్ 10 స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి యానాంకు చెందిన నాగరాజును అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

యానాం: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ముస్లింలకు ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ గురువారం ఇఫ్తార్ విందు నిచ్చారు. యానాంలోని చారిత్రక జామియా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో శామ్యూల్‌తో పాటు స్థానిక ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సూదా భూషణం, విశ్రాంత సీఐ గూటం శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ శ్రీధర్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



ఎస్పీ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ సుసారపు శ్రీధర్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇజ్రాయిల్ స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీధర్‌ను కలిసి స్థానిక పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. ఇటీవల ఇద్దరూ బాధ్యతుల స్వీకరించడంతో వారు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

15 ఏళ్లు దాటిన ప్రభుత్వ బస్సులు తుక్కుకే

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో ఉన్న 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ బస్సులను స్క్రాప్‌కు తరలించనున్నట్లు పుదుచ్చేరి రవాణా శాఖ మంత్రి చంద్రికా ప్రియాంక తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 90 శాతం అంటే సుమారు 175 పుదుచ్చేరి రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ బస్సులు 15 ఏళ్లు దాటి, 15 ఏళ్లకు దగ్గరగా ఉన్నాయన్నారు. వాటి స్థానంలో కొత్త బస్సులు తీసుకురానున్నామని, అయితే ఆర్థికంగా అది భారం కానుందని చెప్పారు. నిధుల సమీకరణకు ఏడాదిపైగా సమయం పడుతుందని, అందుకే గడువు పెంచాలని కోరుతున్నామన్నారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.8.36 లక్షలు

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. గడిచిన 36 రోజులకు గాను రూ.8.36 లక్షల ఆదాయం వచ్చింది. ముమ్మిడివరం గ్రూపు టెంపుల్స్ ఈవో పీకే లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది. గడిచిన ఏడాదిలో జరిగిన స్వామివారి కల్యాణ ఉత్సవాల్లో లభించిన ఆదాయంతో పోల్చితే ఈసారి రెట్టింపు ఆదాయం వచ్చిందని ఈవో దూనబోయిన సాయిబాబు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, పట్టణ వైఎస్సార్ సీపీ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామంలోని సచివాలయం –2 పరిధిలో వలంటీర్‌లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లతో కలిసి గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ చిన్నవరాజు, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, పార్టీ నాయకులు పెయ్యిల రమణ, దోనిపాటి వేణు తదితరులు పాల్గొన్నారు.